క్లుప్తంగా

తాండవ నీటి విడుదలపై నేడు సమావేశం

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి నీటి విడుదలపై సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ అనురాధ ఆదివారం తెలిపారు. నాతవరం సెక్షన్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే సమావేశంలో మండలంలోని ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు. మెజారిటీ రైతుల అభిప్రాయం మేరకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని డీఈఈ వివరించారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

కిర్లంపూడి: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జి.సతీష్‌తో కలసి జగ్గంపేట సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లతో ఆదివారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే బెయిల్ రద్దు చేసి మళ్లీ జైలుకు పంపుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


అచ్చంపేటలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ బొట్టా చైతన్య సూచించారు. మండలంలోని అచ్చంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చైతన్య మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. ఇప్పటికే గ్రామంలో వైరల్, డెంగీ ఫీవర్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. రోగులకు వైద్యులు సకాలంలో వైద్యం అందించాలని సూచించారు.

ఘనంగా మరిడమ్మ తీర్థం


ఏలేశ్వరంలో మరిడమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: కోరిన కోర్కెలు తీర్చే ఏలేశ్వరం గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద కొలువైన అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



క్లబ్ నూతన అధ్యక్షుడు భాస్కర్‌చౌదరిని అభినందిస్తున్న గోలి శ్రీరాములు

జగ్గంపేట: స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం అట్టహాసంగా జరిగింది. లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా కంటే ఉదయ భాస్కర చౌదరి, సెక్రటరీగా వెంపటి రామారావు, ట్రెజరర్‌గా కొత్త కృష్ణ చైతన్య ఎంపికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన క్లబ్ ఎంజీఎఫ్ చిట్నీడి శ్రీనివాస్ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు భాస్కర్ చౌదరి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల, కంటి ఆసుపత్రి నిర్వహణతో పాటు ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ గోలి శ్రీరాములు, కోడూరి రంగారావు, వల్లూరి గంగాధర్‌రావు, కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం
- గోకవరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై విస్తృతస్థాయి సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం


పార్టీ గోకవరం మండల నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న తోట నరసింహం, తోట శ్రీరాంజీ

గోకవరం: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాజీ మంత్రి, ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పిలుపునిచ్చారు. స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో చాలా పవిత్రమైనదని, కాని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనేక బూటకపు హామీలను మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. ఈ పథకాలు అమలు కావని ముందే తెలిసిన బీజేపీ ప్రతినిధి ఆనాడు మేనిఫెస్టోను కనీసం ముట్టుకోలేదన్నారు.

గత ప్రభుత్వంలో 143 హామీలు అమలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 143 హామీలు, నవరత్న పథకాలు అమలు చేశారన్నారు. జగన్ మేనిఫెస్టోను పవిత్ర గ్రంధంలా చూసేవారన్నారు. ప్రజా సంక్షేమం కోసం రూ.2.50 లక్షల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో కేవలం పింఛను రూ.4 వేలకు పెంచిందని, కాని లబ్ధిదారులను మాత్రం తగ్గించిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆరు నెలలకు ఒకసారి నూతన పింఛన్లు ఇస్తే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు.

అమ్మఒడి పేరు మార్చి...

గత ప్రభుత్వం అమ్మఒడి పథకం అమలు చేస్తే కూటమి ప్రభుత్వం దానికి తల్లికి వందనం అని పేరు మార్చిందన్నారు. తల్లికి వందనం లోకేష్ ఆలోచనల నుంచి వచ్చిందని సీఎం చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. తల్లికి వందనం గతేడాది అమలు చేయకుండా ఈ ఏడాది ఇచ్చారని, దానికి కూడా అనేక కొర్రీలు పెట్టారన్నారు. తల్లికి వందనానికి రూ.8 వేల కోట్లు ఇచ్చి, విద్యుత్ చార్జీల పేరుతో రూ.16 వేల కోట్లు ప్రజల నుంచి వసూలు చేశారని విమర్శించారు. నిరుద్యోగులకు రూ.3 వేలు చొప్పున ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు ఏడాదికి 18 వేలు, మహిళలకు ఉచిత బస్సు, రైతులకు ఏడాదికి రూ.20 వేలు, 50 సంవత్సరాలు దాటిని మహిళలకు పింఛను పథకాలు అమలు కాలేదన్నారు. గత ప్రభుత్వంలో వైజాగ్‌లో రుషికొండపై చక్కటి భవంతి నిర్మిస్తే దానిపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. అదే వైజాగ్‌లో యోగాంధ్ర పేరుతో రూ.300 కోట్లు దుర్వినియోగం చేశారన్నారు.

ప్రజలకు బాబు మోసాలను వివరించాలి

బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారంటీ పేరుతో చంద్రబాబు, పవన్ సంతకాలు పెట్టి బ్యాండ్లు ఇచ్చారని, ఇచ్చిన హామీలపై ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు ప్రతిపక్షానికి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామాల్లో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఊరులో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, పార్టీలో చురుగ్గా కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీరాంజీ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు, ఆఖరి అడుగు కూడా ఇదేనన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తొలుత పార్టీ మండల నూతన కార్యవర్గ సభ్యులను తోట నరసింహం పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, ఎస్సీ సెల్ జోనల్ ఇంచార్జి గుల్లా ఏడుకొండలు, వైస్ ఎంపీపీలు మడికి మైనర్ బాబు, గోకాడ చిట్టిబాబు, నాయకులు దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, అక్షింతల రాజా, కర్రి సూరారెడ్డి, సమ్మెటి మోహన్, తోలేటి రాంప్రసాద్, తుమ్మల శివాజీ, నరాలశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

- ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు
- దమ్ముంటే జగన్‌ని టచ్ చేయండి
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం


గోకవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న తోట నరసింహం

గోకవరం: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. లిక్కర్ స్కామ్ పేరుతో ఎంపీ మిథున్‌రెడ్డిని, గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులను అక్రమంగా అరెస్టు చేశారన్నారన్నారు. దమ్ముంటే జగన్‌ను టచ్ చేయాలన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తాను చంద్రబాబుని నయవంచకుడు అన్నట్లు తన మాటలను వక్రీకరించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే నెహ్రూ తనకంటే రెండు పార్టీలు ఎక్కువే మారారన్నారు. తాను పార్టీ మారినా ఎన్నికల ముందు పార్టీకి రాజీనామా చేసి వెళ్లానని, అంతేకాని గెలిచిన పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లలేదన్నారు. 2014లో వైఎస్సార్ సీపీలో నెగ్గిన నెహ్రూ జగన్ సముచిత స్థానం ఇస్తే వెన్నుపోటు పొడిచి టీడీపీలోకి వెళ్లారని ఆరోపించారు. నెహ్రూ తొలుత కాంగ్రెస్, టీడీపీ, ప్రజారాజ్యం, వైఎస్సార్ సీపీ పార్టీలు మారి మళ్లీ టీడీపీలోకి వెళ్లారన్నారు. పార్టీల గురించి మాట్లాడే హక్కు నెహ్రూకి లేదన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పని చేసిన కాలంలో జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానన్నారు. నియోజకవర్గంలో నెహ్రూ శాశ్వతంగా గుర్తుండిపోయే పనులు ఏం చేశారని ప్రశ్నించారు. బొర్రంపాలెం, ఎర్రంపాలెంతో పాటు మరో లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకువచ్చి వేల ఎకరాలకు సాగునీరు అందించానన్నారు. తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా కాలువలు తవ్వించి రూ.680 కోట్లుతో తుని వరకూ నీరు ఇచ్చామన్నారు. తాగునీరు కోసం రూ.12.50 కోట్లతో సీపీ డబ్ల్యూ స్కీమ్ తీసుకువచ్చిన ఘనత తనదేనన్నారు. అధికారంలో ఉండగా తానెప్పుడు కక్ష సాధింపు చర్యలు చేయలేదని, కేవలం ప్రజలకు సేవ మాత్రమే చేశానన్నారు. జగ్గంపేటకు ఫైర్ స్టేషన్ తీసుకువచ్చానని, ఎంపీగా ఉన్న సమయంలో ఒక్క జగ్గంపేట నియోజకవర్గానికే రూ.25 కోట్లు ఇచ్చానన్నారు. వైఎస్ఆర్ చలువతో తాగునీరు, సాగునీరు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు.

రోడ్లు వేసింది నేనే..


తాను అధికారంలో ఉండగా కిర్లంపూడి మండలం వీరవరానికి రూ.32 కోట్లతో రహదారి వేయించినట్టు తెలిపారు. ప్రస్తుతం రహదారి అధ్వానంగా ఉందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటి వరకూ ఎందుకు రహదారి నిర్మించలేదని ప్రశ్నించారు. తన గ్రామానికి రోడ్డు వేయడం జ్యోతుల కుటుంబానికి ఇష్టం లేదన్నారు. తనను దృష్టిలో పెట్టుకునే రోడ్డు వేయడం లేదన్నారు. కానీ మీరు ఉండే రింగు రోడ్డు గ్రామాలకు కూడా రోడ్డు తానే వేశానన్నారు. తాను ఏం చేశానని ప్రశ్నించిన ఎమ్మెల్యే నెహ్రూ వీటికి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ప్రభుత్వాన్ని ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి ఉంటుందని, వ్యక్తిగతంగా ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. జగన్ చుట్టు పక్కల ఉన్న వారిని అరెస్టు చేస్తే అతను వీక్ అవుతారని కూటమి నేతలు భావిస్తున్నారని, అది జరగని పని అన్నారు. ప్రభుత్వం ఎన్ని కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా అక్రమంగా అరెస్టు అయిన వారంతా కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తోట శ్రీరాంజీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు


ఒమ్మంగిలో సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న ముద్రగడ అభిమానులు

ప్రత్తిపాడు రూరల్: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ మండలంలోని ఒమ్మంగిలో సత్తెమ్మతల్లికి ఆయన అభిమానులు పూజలు చేశారు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముద్రగడ పద్మనాభం ఆయురారోగ్యాలతో క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని సత్తెమ్మతల్లికి మొక్కులు చెల్లించారు. ముద్రగడ అనారోగ్యంపై వస్తున్న వదంతులు నమ్మవద్దన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని, అమ్మవారి ఆశీస్సులతో ఆయన క్షేమంగా ఇంటికి వస్తారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని, కొప్పన గంగారావు, ములికి వీరాస్వామి, గిడుతూరి శ్రీరాములు, తటవర్తి అప్పారావు, మాదేపల్లి శ్రీను పోలవరపు భూషణం, చుక్కా రమణ, దారా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా ఏగులమ్మతల్లి


సీతానగరంలో శాకంబరిగా దర్శనమిచ్చిన ఏగులమ్మతల్లి

జగ్గంపేట: గ్రామ శివారు సీతానగరంలో వెలిసిన ఏగులమ్మ అమ్మవారు ఆదివారం భక్తులకు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు సారె, నూతన వస్త్రాలు, నైవేద్యాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

180 మందికి వైద్య పరీక్షలు


తునిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు శివ ప్రసాద్

తుని: స్థానిక నారాయణ స్కూల్‌లో అలయన్స్ క్లబ్, వికాస తరంగణి ఆధ్వర్యంలో 160 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు క్లబ్ గౌరవ అధ్యక్షుడు కుచ్చర్లపాటి భీమరాజు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును అలయెన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అట్లూరి ఉషారాణి ప్రారంభించారు. గైనకాలజిస్ట్ తేజస్విని, నేత్ర వైద్యుడు ఎస్.శివ ప్రసాద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనిక్‌కు సంబంధించి 20 మంది మహిళలు, కంటికి సంబంధించి 160 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. అధ్యక్షుడు డీఏ నాయుడు, ఉపాధ్యక్షుడు ఆంజనేయ ప్రసాద్, కోరుకొండ సత్యనారాయణ, నెల్లిపూడి రాజబాబు, కెవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు

తుని: స్థానిక గణపతి నగర్‌లో సిటీ వాకర్స్, ఆయోధ్య క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. వాకర్స్‌కు సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి ఔషధ గుణాలు కలిగిన తమలపాకు, వెల్లుల్లి, తేనే, అల్లంతో తయారు చేసిన కిళ్లీలను అందజేశారు. ఈ వైద్య శిబిరానికి వాకర్ పోలిశెట్టి రామారావు స్పాన్సర్ చేశారు. సిటీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు లోకారెడ్డి అప్పారావు, ఎన్.రాజు, ప్రిన్స్ సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు


కుమ్మరిలోవ వద్ద నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ రహదారి

తుని రూరల్: కుమ్మరిలోవ కాలనీ తొలగింపు, పోలవరం ప్రధాన ఎడమ కాలువ నిర్మాణానికి అనువుగా తుని నుంచి కొట్టాం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రహదారి నిర్మిస్తున్నారు. తాండవ నదిపై నిర్మిస్తున్న ఆక్విడెక్టు నుంచి కుమ్మరిలోవ కాలనీ చివారుకు చేరుకునే విధంగా ఈ రహదారి పనులు చేపట్టారు. కుమ్మరిలోవ కాలనీ తొలగింపు, కొండపై తవ్విన మట్టి, రాళ్ల తొలగింపునకు అనువుగా ప్రస్తుతం ఉన్న రోడ్డును తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ నేపథ్యంలో కుమ్మరిలోవ, కొలిమేరు, ఎస్.సూరవరం, కొట్టాం తదితర గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ప్రత్యామ్నాయ రహదారి నిర్మిస్తున్నారు. పోలవరం కాలువ పనులు సంవత్సరం పాటు జరిగే అవకాశం ఉండడం, ఆ రహదారిపై రాకపోకలు అధికంగా ఉండడంతో రహదారి మార్గాన్ని ఏర్పాటు చేయక తప్పడం లేదు.

సీఆర్పీల వేతనాలు పెంచాలి


ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసనాయుడికి వినతి పత్రం అందజేస్తున్న రాంజీ ప్రసాద్, యూనియన్ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: సీఆర్పీల వేతనాలను 11వ పీఆర్సీ ప్రకారం తక్షణమే పెంచాలని ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీసీఆర్పీడబ్ల్యూఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, గాదె శ్రీనివాసనాయుడులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంజీ ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తమ జీతాలు పెరగలేదన్నారు. గత ప్రభుత్వం సమగ్ర శిక్షలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగులకు 11వ పీఆర్సీ ప్రకారం 23% వేతనాలు పెరిగాయన్నారు. కాని సీఆర్పీల వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచి, గ్రాడ్యుటీ ఇప్పించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం 11 పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తరాల మీరా సాహెబ్, కోనసీమ జిల్లా అధ్యక్షకార్యదర్శులు నామాడి వెంకట్రావు, పాము రవికుమార్, రాష్ట్ర బరోసా కన్వీనర్ అరిగెల రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వ్యాధుల ముప్పు !

- ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం
- నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలకే ముప్పు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న పశువైద్యాధికారులు


ఒమ్మంగిలోని పంట పొలాల్లో మేత మేస్తున్న గొర్రెలు

ప్రత్తిపాడు రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో పశువులు, గొర్రెలు ఇతర మూగ జీవాలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. జీవాలకు వచ్చే వ్యాధులను గుర్తించిన వెంటనే సకాలంలో అందుబాటులో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించి సరైన చికిత్స చేయించాలి. ముందు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని చెబుతున్నారు.

నియోజకవర్గంలో పశువుల వివరాలు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 11,468 ఆవులు, 40,492 గేదెలు, 34,072 గొర్రెలు, 34,640 మేకలు, 1,21,624 కోళ్ల ఉన్నాయి. కాగా గొర్రెలు, మేకల్లో బ్లూటంగ్ వ్యాధులు సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, పెదవుల వాపు, నోటి లోపల పుండ్లు, కాళ్ల కుంటడం, ఒంట్లో నీరు చేరడం, పారుకోవడం, మేత మెయ్యకపోవడం, ఈసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందలో వేపాకు పొగ పెట్టుకోవాలి. అప్పుడప్పుడూ బ్లూటాక్స్/టిక్కిల్ మందులు పిచికారీ చేస్తూ పోడు ప్రాంతాల్లో మేతకు తీసుకువెళ్లాలి.

కాళ్లపుండ్లు వ్యాధి సోకితే..

మూగజీవాలకు కాళ్లపుండ్లు వ్యాధి సోకితే కాలి గిట్టల మధ్య చీము చేరి చెడువాసన వస్తుంది. అలాగే గొర్రెలు కుంటుతూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే జీవాలను బురద ప్రాంతంలో మేపకూడదు. పొడి ప్రాంతంలోనే మేత వేసే విధంగా చూడాలి.

గొంతువాపు వ్యాధి

పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రమాదకరమైంది. ఈ వ్యాధిని గురకవ్యాధి అని కూడా పిలుస్తారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల ద్వారా ఇది సంక్రమిస్తుంది. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీరు, మేత ద్వారా పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ఈ వ్యాధుల బారిన పడతాయి. గొంతువాపు వ్యాధి బారిన పడిన పశువులను మిగిలిన పశువులతో కలిపి ఉంచితే ఈ వ్యాధి మిగిలిన వాటికి కూడా వ్యాప్తి చెందుతుంది. ఒకేపాకలో మిగతావాటితో ఉంచకుండా వేరుగా ఉంచాలి. అలాగే పశువులు వర్షాలకు తడవకుండా చూడాలి.

నివారణ చర్యలు

జూలై, ఆగస్టు నెలల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి. వ్యాధిసోకిన పశువులను మిగిలినవాటి నుంచి వేరు చేయాలి. వాటి స్థావరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలి.

చిటిక వ్యాధి

ఇది గొర్రెల్లో ఎక్కువగా వస్తుంది. ఎంటరోటాక్సీమియా అనే బ్యాక్టీరియా వల్ల తొలకరి వర్షాలు కురిసే సమయం లో ఈ వ్యాధి గొర్రెలకు సోకుతుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు నీరసిస్తాయి. కొద్దిసేపటికే గిలగిలా కొట్టుకుని మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్న వేళల్లో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన గొర్రెలను గొర్రెల మంద నుంచి వేరు చేయాలి.

టీకాలు వేయించాలి



వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ముందుగానే టీకాలు వేయించడం ఉత్తమం. వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే పశుప్రాణాలకే ముప్పు. పశువులకు సోకే వ్యాధులను గుర్తిస్తే దగ్గరలో ఉన్న పశువుల ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. సకాలంలో వైద్యం అందేలా కృషి చేయాలి.

– చిక్కం బాలచంద్ర యోగేశ్వర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, ప్రత్తిపాడు

సత్యదేవుని దర్శించిన విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్


సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న రమణమూర్తి దంపతులు

అన్నవరం: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్‌వీ రమణమూర్తి దంపతులు ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులందించి స్వామి వారి ప్రసాదాలు బహూకరించారు. వారి వెంట దేవస్థానం ఈఈ రామకృష్ణ తదితరులున్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

తొండంగి: కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు అల్లాడిన ప్రజలు ఆదివారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై వాతావరణం పూర్తిగా చల్లబడింది. కాగా మరో రెండు రోజులపాటు వర్షాలకు కురుస్తాయని భారత వాతావరణశాఖ ప్రకటించడంతో వరినారుమడులు వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు


కోటనందూరులో దుకాణదారుడికి నోటీసు అందిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

కోటనందూరు: ప్లాస్టిక్ నిషేధం అమలుకు వ్యాపారులు సహకరించాలని ఎంపీడీఓ వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్ల అమ్మకం, వినియోగం చేయకూడదని పంచాయతీ అధికారులు స్థానిక వ్యాపారులకు ఆదివారం నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ప్రత్యామ్నాయ కవర్లు వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ.250 నుంచి రూ.5 వేల వరకూ జరిమాన విధిస్తామని హెచ్చరించారు. దుకాణాల ముందు చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.